


రియాద్ జైలులో బోధన్ యువకుడు 2



యూజీడీ గుంతలు.. నరకానికి తోవలు.. 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి




**అక్షరటుడే,ఎల్లారెడ్డి:** విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్, మున్సిపల్ కార్పొరేషన్ విశ్రాంత డిప్యుటీ కమిషనర్ అబ్బాయి లింబాద్రి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో గురువారం ఎడపల్లి మండలం తానాకలాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, జామెట్రి బాక్సులు అందజేశారు. పి.రాఘవేంద్ర బాబు, చింతల గంగాదాస్, అంకం రాజేందర్, హెచ్ఎం పరమేశ్వర్, ఉపాధ్యాయులు ప్రదీప్ పాల్గొన్నారు.



**ఉన్నత విద్యకు నిలయంగా విలసిల్లాల్సిన తెలంగాణ యూనివర్సిటీ ప్రస్తుతం నిర్ణయాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. వర్సిటీలో సమర్థవంతమైన పాలన కోసం ప్రతి మూణ్నెళ్లకొకసారి తప్పనిసరిగా పాలకమండలి(ఈసీ) సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనలు తెయూలో అటకెక్కాయి.**

– అక్షరటుడే, తెయూ క్యాంపస్




# తెయూ పాలక మండలి భేటీపై జాప్యమేలా..?

■ తెయూలో కీలక నిర్ణయాలకు బ్రేక్..! ■ అధ్యాపకుల్లో అసంతృప్తి ■ 24 తేదీన ఈసీ సమావేశం.?

తెలంగాణ యూనివర్సిటీలో కొత్త పాలకమండలి కొలువుదీరిన తర్వాత ఒకసారైనా సమావేశం ఏర్పాటు చేయపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈసీ యూనివర్సిటీకి అత్యంత కీలకం. ఈసీ నిర్వహించడం కేవలం పరిపాలనా కార్యక్రమమే కాకుండా యూనివర్సిటీకి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే రాజ్యాంగబద్ధ వేదిక. అలాంటి వేదికను నెలల తరబడి నిర్వహించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నిబంధనలున్నా.. సమావేశం ఏదీ..?**

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనల ప్రకారం కనీసం మూడు నెలలకోసారి 'పాలక మండలి సమావేశం'(ఈసీ) తప్పక నిర్వహించాలి. యూనివర్సిటీలో పాలనకు, ఉద్యోగుల సమస్యలు, ఆర్థిక, విధాన పరమైన కీలక నిర్ణయాల అమలుకు ఈసీ సమావేశం అత్యంత కీలకం. కానీ తెలంగాణ యూనివర్సిటీలో పాలక మండలి నిర్వహణలో జాప్యం అధ్యాపక వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. ఏప్రిల్ నెలలో నూతన పాలకమండలి కమిటీ నియమించిన తర్వాత ఒక్కసారి సమావేశం

**అనేక సందేహాలు..**

ఈసీ భేటీ జరగకపోవడంపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. నెలలు గడుస్తున్నా ఈసీ సమావేశానికి ముహూర్తం ఖరారు కాకపోవడంతో కీలక అంశాలు నిర్ణయాలకు నోచుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతోంది. పాలకమండలి సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాల్సిన అవసరం ఉంది. పాలక మండలి వైస్ ఛైర్మన్ అయిన వైస్ ఛాన్స్లర్ ఉద్దేశపూర్వకంగానే సమావేశాలను వాయిదా వేస్తున్నారని, నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని అధ్యాపకులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఈసీ సమావేశాలు నిర్వహించడం లేదంటూ కొందరు ఆచార్యులు ఇటీవల గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

**పదోన్నతుల అంశమే ప్రధాన ఎజెండా..**

ప్రస్తుతం తెయూలో అత్యంత కీలకంగా మారిన అంశాల్లో 2012, 2013, 2014 ఉద్యోగ నోటిఫికేషన్లో నియామకమైన అధ్యాపకుల పదోన్నతుల వ్యవహారం ఒకటి. ఈ నియామక ప్రక్రియకు సంబంధించి గతేడాది అక్టోబర్ 30న హైకోర్టు తీర్పు వెలువడగా.. అధ్యాపకులు అప్పీల్కు వెళ్లారు. మరోవైపు తమకు పదోన్నతులు కల్పించాలంటూ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇటీవల యూనివర్సిటీని సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య సైతం 2014లో నియమితులైన అధ్యాపకులకు పదోన్నతులు కల్పించే అంశాన్ని పరిశీలించాలని వీసీ, రిజిస్ట్రార్కు సూచించారు. అలాగే 2014 ఏడాది నియామకాల్లో ఉద్యోగం రాక నష్టపోయిన బాధితుడు వెంకట్ నాయక్ ఇటీవల జాతీయ ఎస్టీ కమిషన్ను ఆశ్రయించారు.నియామకాల్లో రోస్టర్ విధానం సరిగ్గా పాటించలేదని, ఈ నియామకాలకు ఈసీ అనుమతి లేదంటూ ఫిర్యాదు చేశారు. దీంతో యూనివర్సిటీ అధికారి ఎస్టీ కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నిర్వహించే ఈసీ మీటింగ్లో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది. అభివృద్ధి పనులు, మౌలిక వసతులు తదితర కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

## కామారెడ్డిలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని రైల్వే గేటు వద్ద తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కోరారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఎస్సీఆర్జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధ్యక్షతన జరిగిన ఎంపీల సమావేశంలో ఆయన పాల్గొని కామారెడ్డి జిల్లా రైల్వే సమస్యలను ప్రస్తావించారు. సమావేశానికి ముందు కామారెడ్డి స్టేషన్ మాస్టర్తో మాట్లాడి స్థానిక అవసరాలను తెలుసుకుని వాటిని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఫ్రోబెల్ స్కూల్ సమీపంలోని 209ఏ గేట్ వద్ద ఉప్పల్వాయి నుంచి రైలు బయలుదేరగానే గేట్ మూసివేస్తుండటంతో 25 నుంచి 30 నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోతున్నాయని తెలిపారు. వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.




## తరగతి గదుల్లేకుంటే చదివేది ఎలా.. విద్యార్థుల ధర్నా

**అక్షరటుడే, కామారెడ్డి:** వెయ్యి మంది విద్యార్థులకు పది తరగతి గదులు ఉంటే ఎక్కడ చదువుకోవాలి అంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రశ్నించారు. కళాశాల నుంచి కొత్తబస్టాండ్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు సుమారు 500 మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తాలో బైఠాయించి నిరసన తెలిపారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికి అందుకు అనుగుణంగా గదులు లేవన్నారు. అదనపు గదులు ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. గదులు లేక చెట్ల కింద, వరండాలో చదువుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్ మాట్లాడుతూ.. కళాశాలలో నెలకొన్న సమస్యలపై అనేక సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించామన్నారు. అయినా ఇప్పటికి వసతులు కల్పించడంలో విఫలం అయ్యారన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రత్యేక దృష్టి సారించి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అదనపు గదులు మంజూరు చేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోతే విద్యార్థులతో కలిసి నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

## ఏసీబీకి చిక్కిన రాజంపేట ఎస్సై..



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ అధికారే అడ్డదారి తొక్కాడు. స్టేషన్ బెయిల్ కోసం లంచం డిమాండ్ చేసి చివరికి ఏసీబీకి రెడ్హ్యాండెడ్గా చిక్కాడు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం కామారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట మండలానికి చెందిన ముత్యపు సిద్ధిరాములుకు రాజంపేటలో సిమెంట్ షాప్ ఉంది. పక్కనే ఉన్న మరొక షాపు వారు ఇటీవల సిద్ధిరాములు, అతని కొడుకుపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయంలో ఇరు వర్గాలపై కేసులు నమోదయ్యాయి. అయితే సిద్ధిరాములు కొడుకుపై తక్కువ సెక్షన్లు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇస్తానని ఎస్సై ఆంజనేయులు చెప్పాడు. దానికి రూ.50 వేలు డిమాండ్ చేశాడు. ఇందులో ఇదివరకే రూ.10 వేలు ఇచ్చాడు. మిగతా రూ.40 వేల కోసం ఒత్తిడి చేయగా చివరికి రూ.30వేలు ఇవ్వాలన్నారు. ఆ డబ్బులు ఇవ్వలేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీలో ఉన్న ఎస్సై నివాసంలో బాధితుడి నుంచి రూ.30 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. విచారణ కొనసాగుతుందని, శుక్రవారం ఉదయం ఎస్సైని నాంపల్లి కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. కాగా ఎస్సై ఆంజనేయులు గతంలో భిక్కనూర్ మండలంలో పని చేసినప్పుడు సైతం ఆయనపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటీవల బదిలీల్లో భాగంగా రాజంపేట ఎస్సైగా గత నెల 17న నియమితులయ్యారు. నెలరోజులకే ఏసీబీకి చిక్కడం గమనార్హం. కాగా జిల్లా ఎస్పీగా రాజేష్ చంద్ర బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలీస్ స్టేషన్లలో క్రమశిక్షణ పెరిగిందని, చిన్న పొరపాటు జరిగినా వెంటనే సమాచారం చేరుతోందని చెబుతున్నారు. అయినప్పటికీ ఓ ఎస్సై లంచం తీసుకుంటూ పట్టుబడటంతో పోలీస్ శాఖలో కలకలం రేగుతోంది.

## నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై ఎల్లారెడ్డి బల్దియా చర్యలు




**అక్షర టుడే, ఎల్లారెడ్డి:** నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై ఎల్లారెడ్డి బల్దియా చర్యలు తీసుకుంది. ఈ మేరకు ప్లాస్టిక్ వినియోగిస్తున్న పలు దుకాణాలకు జరిమానాలు విధించింది. ఇన్ఛార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ పర్వేజ్ ఆధ్వర్యంలోని బృందం ప్రధాన బజార్, బస్ స్టాండ్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లోని దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, స్ట్రాలు విక్రయిస్తున్న వ్యాపారులను గుర్తించి జరిమానా విధించారు. అదే సమయంలో నిషేధిత ప్లాస్టిక్ను సీజ్ చేశారు. పర్వేజ్ మాట్లాడుతూ ప్రభుత్వ, మున్సిపల్ నిబంధనల ప్రకారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. మొదటి సారి పట్టుబడితే రూ.2వేలు, రెండోసారి రూ.5వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ జీవన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులు, అరటి ఆకులు, పేపర్ కప్పుల వంటి ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని కోరారు.

## వధూవరులను ఆశీర్వదించిన షబ్బీర్అలీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నగరంలో పర్యటించారు. ఖాజా కాలనీలోని ఖాన్స్ కాటేజ్ను సందర్శించిన ఆయన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ ముజాహిద్ ఖాన్, యువ నాయకుడు జావేద్ ఖాన్తో పాటు కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. ముజాహిద్ ఖాన్ కుమార్తె వివాహం సందర్భంగా అభినందనలు తెలియజేశారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ అంశాలతో పాటు ప్రస్తుత పరిణామాలపై కూడా చర్చించారు.

## ఒక విద్యార్థికి రెండు ఆధార్ కార్డులు.. అగమ్యగోచరంలో విద్యార్థి చదువు



**అక్షరటుడే, ఇందూరు:** ఒక విద్యార్థికి రెండు ఆధార్ కార్డులు ఇవ్వడంతో ఆ విద్యార్థి చదువు ప్రస్తుతం అగమ్య గోచరంగా మారింది. ఈ ఘటన నగరంలోని ఆధార్ సెంటర్లో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం గంగరమంద గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కొడుకు ఆధార్ కార్డు అప్డేట్ నిమిత్తం నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలోని ఆధార్ సెంటర్కు వచ్చాడు. అయితే ఆధార్ సెంటర్లోని నిర్వాహకులు పాత ఆధార్ కార్డును చూసి ఇది ఆన్లైన్లో కనిపించడం లేదని కొత్త ఆధార్ కార్డు తీసుకోవాలని పేర్కొన్నారు. నివాస ధృవపత్రం తీసుకొస్తే కొత్త ఆధార్ కార్డు తీద్దామని పేర్కొనడంతో బాధితుడు నివాస ధృవపత్రంతో ఆధార్ కేంద్రాన్ని సంప్రదించాడు. వారు నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థి పేరిట మరో కొత్త ఆధార్ కార్డు తీశారు. అయితే కొత్త ఆధార్ కార్డుతో పాఠశాలకు వెళ్లిన విద్యార్థి తండ్రికి చుక్కెదురైంది. ఆన్లైన్లో సదరు విద్యార్థికి సంబంధించిన ఆధార్ వివరాలు కనిపించకపోవడంతో పాఠశాల నిర్వాహకులు మళ్లీ మొదటి నుంచి చదువుకోవాలని సూచించారని బాధితుడు తెలిపాడు. నాలుగేళ్ల చదువును పక్కకు పెట్టి మళ్లీ మొదటి నుంచి చదవాలని చెప్పడంతో ఏమీ అర్థం కాని పరిస్థితుల్లో తిరగి నగరంలోని ఆధార్ సెంటర్ను ఆశ్రయించాడు.

## టీబీ రహిత జిల్లాగా నిజామాబాద్ను తీర్చిదిద్దాలి: కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** టీబీ రహిత జిల్లాగా నిజామాబాద్ను తీర్చిదిద్దాలని కలెక్టర్ భవేష్ మిశ్రా పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'పై మండల స్థాయి ప్రత్యేక అధికారులకు కలెక్టరేట్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వందశాతం డీబీటీ లక్ష్యంగా అధికారులు ముందుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు జనవరి నుండి జూన్ వరకు మంజూరైన పోషకాహార పారితోషికం నిధులను అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 47శాతం మాత్రమే ప్రక్రియ పూర్తయిందని, మిగతా ప్రక్రియను త్వరలోనే పూర్తి చేయాలని సూచించారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ కాకపోవడం వల్ల 126 మంది రోగులకు డీబీటీ నిలిచిపోయిందని, వెంటనే వారందరికీ ఆధార్ లింక్ చేయించి నిధులు మంజూరయ్యేలా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలను భాగస్వాములను చేస్తూ బాధితులకు ఫుడ్ బాస్కెట్లు అందేలా చూడాలని కోరారు. సిద్ధాంతాల కంటే క్షేత్రస్థాయిలో ఫలితాలు సాధించడమే ముఖ్యమని స్పష్టం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 975 మంది క్షయ బాధితులు ఉన్నారని తెలిపారు. ప్రతి మండలంలో స్పెషల్ ఆఫీసర్, ఐదుగురు ఎన్సీసీ వలంటీర్లు, ఐదుగురు మై భారత్ వలంటీర్లతో కూడిన బృందం రోగుల సంక్షేమంపై




దృష్టి సారించాలని కోరారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కనీసం ఒక క్షయ రోగికి పోషకాహార కిట్ అందించేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. 2025 జనవరి జూన్ కాలంలో టీబీ ఎంబీఏ 1.0 కింద 97శాతం చికిత్స పూర్తయిందని వెల్లడించారు. అనంతరం డీటీసీవో దేవి నాగేశ్వరి పీపీటీ ద్వారా శిక్షణా తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు), డీఆర్డీఏ పీడీ సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఐవో అశోక్, డాక్టర్ సికందర్ నాయక్, వెంకన్న, సుప్రియ, వెంకటేష్, నవ్య, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకులు బాధ్యతతో ఉండాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో విద్యార్థుల నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఉద్దేశంతో స్టూడెంట్ కౌన్సిల్ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ మాట్లాడుతూ.. పాఠశాల ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థి నాయకులు బాధ్యతాయుతంగా ఉండాలని అన్నారు. నాయకత్వం అనేది కేవలం పదవి కాదని, అదొక బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతినిధులు: బాలుర స్కూల్ క్యాప్టెన్: వెంకట తేజ, బాలికల స్కూల్ క్యాప్టెన్: మాన్యత రెడ్డి, బాలుర వైస్ క్యాప్టెన్: సి.హెచ్. రామ్, బాలికల వైస్ క్యాప్టెన్: వెన్నెల, స్పోర్ట్స్ క్యాప్టెన్: వివేక్ దత్త, కల్చరల్ క్యాప్టెన్: విక్రాంత్, డిసిప్లిన్ క్యాప్టెన్: జి. శ్రీ చరణ్, హైజీన్ క్యాప్టెన్: సహర్ష్.

## ఆలూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. కొత్తగా లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కావడంతో సర్పంచ్ ముక్కెర విజయ్, ఎంపీవో గంగమోహన్ ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు తెలిపారు. పేదవారికి సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎవరు అభ్యర్థిగా నిలిచినా గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి, ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారులకు విడతల వారీగా ప్రభుత్వం నిధులు జమ చేస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజలింగం, తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


## చికిత్స పొందుతూ జర్నలిస్ట్ మృతి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని బర్ధిపూర్ శివారులో ప్రధాన రహదారిపై ఈనెల 8వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ టీవీ ఛానల్ రిపోర్టర్ అఫ్సర్ పాషా(38) చికిత్స పొందుతూ గురువారం ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై ఆరీఫ్ వివరాలు వెల్లడించారు. ద్విచక్రవాహనంపై నిజామాబాద్ వైపు వెళ్తున్న అఫ్సర్‌ను కారు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆయనను అంబులెన్సులో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ అఫ్సర్(38) మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడు అఫ్సర్ చాలా ఏళ్లుగా వివిధ టీవీ ఛానళ్లలో పనిచేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అఫ్సర్ మరణించడంతో డిచ్‌పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. డిచ్‌పల్లి రిపోర్టర్ అఫ్సర్ పాషా మృతి బాధాకరమని రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అఫ్సర్ మృతి పట్ల ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అఫ్సర్ పాషా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

పొట్ట కూటి కోసం సౌదీ అరేబియాకు వలస వెళ్లిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్లుగా రియాద్ జైలులో ఉన్నాడు. భర్తను ఎలాగైనా జైలు నుంచి బయటకు తీసుకుని రావాలని దివ్యాంగురాలైన అతడి భార్య చంటి బిడ్డను వెంటబెట్టుకుని గడపగడపకు తిరుగుతోంది. మరోవైపు వృద్ధ తల్లిదండ్రులు సైతం తమ కొడుకు ఎప్పుడు వస్తాడా అంటూ వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. - అక్షరటుడే, బోధన్



# బోధన్ యువకుడు రియాద్ జైలులో..



■ రూ.84లక్షల బ్లడ్‌మనీ ఇస్తేనే విడుదల ■ దివ్యాంగురాలైన భార్య.. ఆమెకు ఓ బిడ్డ ■ చిల్లిగవ్వ లేక తల్లడిల్లుతున్న నిరుపేద కుటుంబం

బోధన్ నియోజకవర్గంలోని సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రామయ్య, రాజమణి కుమారుడు శ్రావణ్‌కుమార్ (22) కు చింతల్‌పేట్‌కు చెందిన దివ్యాంగురాలు మమతతో వివాహమైంది. అనంతరం శ్రావణ్ కుటుంబ పోషణ నిమిత్తం సౌదీ అరేబియాలోని రియాద్‌కు వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేట్ మెడికల్ రీసెర్చ్ కంపెనీలో అంబులెన్స్ డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరాడు.

### 2024లో ప్రమాదం..

అయితే 2024 మే 6న శ్రావణ్ నడుపుతున్న అంబులెన్స్ రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో స్థానికులైన భార్యాభర్తలు మృతి చెందారు. వారి ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అక్కడి పోలీసులు శ్రావణ్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో సౌదీ అరేబియా కోర్టు శ్రావణ్‌ను సాక్ష్యాధారాలతో నేరస్తుడిగా నిర్ధారించింది. బాధిత కుటుంబానికి 3.30 లక్షల సౌదీ రియాద్‌లను 'బ్లడ్ మనీ'గా ఇవ్వాలని తీర్పునిచ్చింది. ఇది భారత కరెన్సీలో రూ.84లక్షలు. అంత మొత్తం చెల్లిస్తేనే శ్రావణ్ అక్కడి జైలు నుంచి విడుదలయ్యే అవకాశలున్నాయి.

### ఆర్థిక స్థోమత లేక..

ఆర్థిక స్థోమత లేని శ్రావణ్ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న శ్రావణ్ జైలులో ఉండడం.. వృద్ధు తల్లిదండ్రులను కూలీకి వెళ్లేలా చేసింది. మరోవైపు దివ్యాంగురాలైన భార్య మమత చంటిబిడ్డతో తన భర్తను విడిపించాలని ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తో పాటు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఆమె వినతిపత్రాలు అందజేసింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రవాసీ ప్రజావాణిలోనూ తన భర్త పరిస్థితిని వివరించింది. ఎలాగైనా తన భర్తను విడిపించి, ఇక్కడకు తీసుకు రావాలని కోరింది.

### ప్రజాప్రతినిధులు, మానవతావాదులు స్పందించాలి

మమత మాట్లాడుతూ.. తమ కుటుంబానికి రూ.84లక్షలు కట్టే స్థోమత లేదని కన్నీటి పర్యంతమైంది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, మానవతావాదులు స్పందించి తన భర్తను స్వదేశానికి తీసుకురావాలని వేడుకుంటోంది. రెక్కల కష్టంపై బతికే నిరుపేద కుటుంబం తమదని.. ఇంత భారీ మొత్తాన్ని ఎక్కడినుంచి తేవాలో తెలియట్లేదని వాపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తన భర్తను విడిపించాలని ఆమె వేడుకుంటోంది.



## యూజీడీ గుంతలు.. నరకానికి తోవలు..

నగరంలో యూజీడీ గుంతలు ప్రజలకు ప్రాణసంకటంగా మారాయి. 24వ డివిజన్ గాయత్రినగర్‌లో చింతచెట్టు మైసమ్మ మందిర్ వద్ద రోడ్లపై యూజీడీ గుంతల్లో మరమ్మతులు జరుగుతున్నాయి. అయితే మ్యాన్‌హోల్స్‌పై క్యాప్‌లు పెట్టకపోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులు పొరపాటున ఈ గుంతల్లో పడితే ప్రాణాలమీదికి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వాటిపై క్యాప్‌లు పెట్టించాలని కోరుతున్నారు.

**– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్**



## 22న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీల ఎన్నిక



**అక్షరటుడే, కోటగిరి:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 22న కోటగిరి, పోతంగల్ మండల నూతన కమిటీలను ఎన్నుకోనున్నట్లు బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జ్ సోంపుర్ కె. పోచిరాం తెలిపారు. గురువారం పోతంగల్‌లోని ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22వ తేదీన ఉదయం కోటగిరి మండల కేంద్రంలోని ఏబీఆర్ ఫంక్షన్ హాల్‌లో, మధ్యాహ్నం పోతంగల్‌లోని ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నూతన కమిటీల ఎన్నికల సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మాసాయిపేట యాదగిరి మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. ఇరు మండలాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మాదిగలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



## చిన్నాపూర్‌లో ఇంటింటికీ మొక్కల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్ :** మాక్లూర్ మండలంలోని చిన్నపూర్ గ్రామంలో సర్పంచ్ చిన్న గంగాధర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్న గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రామస్తులకు సూచించారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫొటోగ్రాఫర్ రాజేందర్‌కు ఘన సన్మానం



**అక్షరటుడే, బాల్కొండ:** ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికైన సింధుల రాజేందర్‌ను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు సింధుల రాజేందర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఫొటోగ్రఫీ రంగంలో ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, సెక్రటరీ చాకులింగం, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, కోశాధికారి వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌ను రద్దు చేయాలి



**అక్షరటుడే,బోధన్:** యూరియా బుకింగ్ యాప్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఆ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఎడపల్లి మండలం సాటాపూర్ గేటు వద్ద ధర్నా చేపట్టి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యూరియా యాప్‌లో సాంకేతిక లోపాల వల్ల సకాలంలో ఎరువులు బుక్ కావడం లేదని, దీంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బందిగా మారిన ఈ యాప్‌ను వెంటనే రద్దు చేసి, పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి యాప్‌ను రద్దు చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## సీపీఎస్ రద్దు కోసం 'ఛలో హైదరాబాద్' పోస్టర్ల ఆవిష్కరణ





**అక్షరటుడే, బాన్సువాడ:** సీపీఎస్ రద్దు కోసం టీఎస్సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఛలో హైదరాబాద్' పోస్టర్లను మండలంలోని బోర్లం ఉన్నత పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. కాంప్లెక్స్ సమావేశం విరామ సమయంలో ఉపాధ్యాయులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించామన్నారు. సీపీఎస్ రద్దు కోసం నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఉద్యోగుల భవిష్యత్తు ప్రయోజనాల కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట రమణ, నక్క ప్రవీణ్, ఆనంద్, సాయిరాం, మహేందర్, సంపత్, సంతోష్, ప్రసన్నలత, చైతన్య, రజిత, గంగామణి, శ్రీకాంత్ రెడ్డి, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీల కూలీలకు అన్నదానం



**అక్షరటుడే, బాల్కొండ:** ప్రపంచ మానవతా దినోత్సవాన్ని బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జలాల్‌పూర్ శివారులోని ఇటుక బట్టీలో నిర్వహించారు. బట్టీలో పనిచేస్తున్న కూలీలకు అన్నదానం చేశారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ఆదేశాల మేరకు ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ రీజనల్ కార్యదర్శి చాకు లింగం తెలిపారు. సమాజంలోని అవసరమైన వారికి అండగా నిలవడం, సేవా కార్యక్రమాలను కొనసాగించడం లయన్స్ క్లబ్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, అజీముల్లా, మోతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## నరకప్రాయంగా బాన్సువాడ - కామారెడ్డి రోడ్డు

**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలంలో అటు కామారెడ్డి, ఇటు బాన్సువాడలను కలిపే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై, కనీసం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. దీంతో గాంధారి నుండి కామారెడ్డి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా, ఇటీవల ఇక్కడి పెద్ద గుంతలోనే చిక్కుకొని రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంత జరుగుతున్నా అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేయించకుండా కాలయాపన చేయడం విడ్డూరంగా ఉందని స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.